# చెక్ డ్యామ్‌తో నీటి సమస్యకు చెక్

- రెడ్లకుంటలో నిర్మాణం
- హర్షం వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు

కోదాడ రూరల్, అక్టోబర్ 16 : మండలంలోని రెడ్లకుంట సాగర్ కాల్వ చివరి భూములు నీటి కొరత తీర్చేందుకు పాలేరు వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణంతో వాగు నీటితో పాటు, పరిసర ప్రాంతంలో భూగర్భజలాలు పెరిగి నీటి సమస్య తీరింది. ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ అలుగు నీటితో ప్రారంభమయ్యే ఈ వాగు పలు చిన్న వాగులతో కలసి నియోజవర్గంలోని అనంతగిరి, కోదాడ మండలాల మీదుగా ప్రవహిస్తూ రెడ్లకుంట తరువాత కృష్ణానదిలో కలుస్తుంది. పాలేరు వాగుపై ఎక్కడ చెక్‌డ్యామ్‌లు లేకపోవడంతో ప్రతి సంవత్సరం వేల క్యూసెక్యూల నీరు వృథాగా నదిలో కలుస్తుంది. నీటి వృథాను అరికట్టి, టేలెండ్ భూములకు నీరందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నీటి శాఖ అధ్వర్యంలో చెక్ డ్యాంల నిర్మాణం తలపెట్టింది. దీనిలో భాగంగా మండల శివారు గ్రామం రెడ్లకుంట వద్ద 800 ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో రూ.3.32 కోట్లతో చెక్‌డ్యాం నిర్మాణం పూర్తి చేసుకుంది.



పాలేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్

### పెరిగిన నీటి నిల్వ సామర్థ్యం

రెడ్లకుంట శివారు ఆంధ్ర రాష్ట్రం జగ్గయ్యపేట మండలం బలుసుపాడు సరిహద్దును కలుపుతూ ఈ చెక్ డ్యాం నిర్మించారు. దీంతో వాగులోని నీటి సామర్థ్యం భారీగా పెరిగింది. దీంతో రెడ్లకుంటతో పాటుగా ఎగువన ఉన్న నల్లబండగూడెం, ఏపీలోని బలుసుపాడు, తక్కెళ్లపాడు వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర నీటి నిల్వ పెరిగింది. దీంతో వాగుపై మోటార్ల సాయంతో రైతులకు నీటి సమస్య తప్పింది.

### 800ఎకరాలకు సాగు నీరు

పాలేరు వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణంతో వాగుపై ప్రత్యక్షంగా మోటార్లు ఏర్పాటు చేసుకున్న రైతులతో పాటు బావులు, బోర్ల సాయంతో సాగు చేస్తున్న 800 ఎకరాలకు నీరు అందుతుంది. గతంలో వేసవిలో వాగులో నీరు లేక ఇబ్బందయ్యేదని, చెక్ డ్యామ్ నిర్మాణంతో ఆ సమస్య తీరిందని రైతులు అంటున్నారు.

### రెండు పంటలకు ఢోకా లేదు



చెక్‌డ్యాం నిర్మాణంతో రైతుల రెండు కార్లకు నీటికి ఢోకా లేదు. గతంలో వేసవి వచ్చిందటే నీటి కోసం వాగులో ప్రొక్లెయిన్లతో గోతులు తవ్విన నీటి సమస్య తీరేది కాదు. అందుకు బోలేడు ఖర్చు వచ్చేది. చెక్‌డ్యాం నిర్మాణంతో నాకున్న 10ఎకరాలకు సాగునీరు సమృద్ధిగా అందుతుంది.

మల్లెల నిరంజన్, రెడ్లకుంట రైతు

### ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి



పాలేరు వాగు నీరు వృథా కావద్దని గ్రామస్తులు ఎన్నో ఎండ్ల కల, కలగానే మిగిలింది. తెలంగాణ ప్రభుత్వం చివరి భూములకు నీరు అందిస్తామని ఇచ్చిన హామీని పురస్కరించుకుని, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చెక్ డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తైంది. దీంతో గ్రామస్తుల నీటి సమస్య తీరింది. చెక్ డ్యాం నిర్మించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు.

– సర్పంచ్ సాధినేని లీలాఅప్పారావు

## ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌కు ఘన స్వాగతం



మోతె : ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల, అక్టోబర్ 16 : సీఎం కేసీఆర్ నుంచి బీఫామ్ అందుకుని కోదాడకు వస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు నియోజకవర్గం పొలిమేర మాధవరం గ్రామ శివారులో పార్టీ నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. మోతె, మునగాల, నడిగూడెం, కోదాడ ప్రాంతాల కార్యకర్తలు వేలాది మంది అక్కడికి చేరుకోవడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా మల్లయ్యయాదవ్‌ను గజమాలతో సన్మానించారు. మునగాల, నడిగూడెం, కోదాడ ఎంపీపీలు ఎలక బిందు, యాతాకుల జ్యోతి, రాధారెడ్డితోపాటు మహిళలు ఆయనకు హారతినిచ్చి స్వాగతం పలికారు. కార్యకర్తలు పటాకాలు కాల్చి నృత్యాలు వేశారు. జైమల్లన్న– జైజై మల్లన్న అని నినాదాలు చేశారు. మల్లయ్యయాదవ్ అందరికీ కరచాలనం చేస్తూ ప్రచార రథంపై ముందుకు సాగారు. జాతీయ రహదారి మీదుగా మాధవరం నుంచి ఆకుపాముల వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తొగరు రమేశ్, సహకార సంఘం చైర్మన్ కందిబండ సత్యనారాయణ, సీనియర్ నాయకులు నల్లపాటి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ కోల ఉపేందర్‌రావు, వెంపటి మధు, తుమ్మలపల్లి భాస్కర్, ఓరుగంటి బ్రహ్మం, మైనార్టీ నాయకులు సైదా, బంగారపు సత్యం, శాఖమూడి కృష్ణయ్య, నూనె నాగన్న, సర్పంచులు విజయలక్ష్మి, శ్యాంసుందర్‌రెడ్డి, చింతకాయల ప్రమీల, వీరమ్మ, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మోతె : మండలంలోని నామవరం గ్రామ సమీపంలో గుంజలూరు జాతీయ రహదారిపై ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు బీఆర్ఎస్ కార్యకర్తలు సోమవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం బైక్ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులు, జిల్లా నాయకులు ఏలూరి వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ ఆరె లింగారెడ్డి, మిక్కిలినేని సతీశ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పానుగోటి నర్సింహారావు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కాంపాటి వెంకన్న, మండల ఉపాధ్యక్షుడు కారింగుల శ్రీనివాస్‌గౌడ్, దేవులనాయక్, సర్పంచులు నూకల యుగంధర్ రెడ్డి, వాసంశెట్టి రమేశ్, శంకర్‌నాయక్, భూక్య గాంధీ, బాబునాయక్, జానిపాష, ఇండ్ల వెంకటేశ్వర్లు, ముత్తయ్య, సోమేశ్‌గౌడ్, కొండా వెంకన్న, సాజ్యానాయక్, మహేందర్, దేవేందర్ పాల్గొన్నారు.

నడిగూడెం : కోదాడ ఎమ్మెల్యేగా బొల్లం మల్లయ్యయాదవ్ రెండోసారి గెలుపు నల్లేరు మీద నడకేనని ఎంపీపీ యాతాకుల జ్యోతీమధుబాబు అన్నారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు స్వాగతం పలికేందుకు మండల నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

## సహకార సంఘాలపై కేంద్రం నిరంకుశ వైఖరి వీడాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, వెంకటయ్య

చిలుకూరు, అక్టోబర్16 : సహకార సంఘాలపై కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరి వీడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య అన్నారు. బ్యాంకింగ్ రెగ్యులేషన్ సవరణ చట్టం 2020లోని సెక్షన్12(1)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చిలుకూరులోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం చేపట్టిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సహకార సంఘాలను నిర్వీర్యం చేసే కుట్ర ప్రధాని మోదీ చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సహకార సంఘాలపై తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేసి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసీల్దార్ సరితకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాలెబోయిన రవి, యరగాని నాగయ్య, బొడ్డు కాశయ్య, సైదులు, సరోజిని, లక్ష్మి, వెంకటనర్సు పాల్గొన్నారు.



తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

## బీఆర్ఎస్ విజయ యాత్ర సాగించాలి

- దుర్గమ్మకు ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ సతీమణి ఇందిర పూజలు

కోదాడ, అక్టోబర్ 16 : వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడంతో పాటు, ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ మరోసారి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ స్థానిక బ్రాహ్మణ భవన్‌లో ఏర్పాటు చేసిన దుర్గమ్మకు ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ సతీమణి ఇందిర ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ తిరిగి రెండోసారి గెలిచేందుకు ఆశీస్సులు అందించాలని కోరారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ సతీమణి ఇందిర

## సమష్టి కృషితో అభివృద్ధికి పాటుపడాలి

- అనంతగిరి ఎంపీపీ వెంకటేశ్వర్లు

అనంతగిరి, అక్టోబర్ 16 : మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా మండలాభివృద్ధికి పాటు పడాలని ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు గ్రామాల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. అంతకు ముందు శాంతినగర్, అమీనాబాద్ గ్రామల సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశాల్లో చర్చించిన సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో పలు గ్రామాలను కలుపుతూ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ధరావత్ రామా, ఎంపీడీఓ విజయశ్రీ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శి శ్వేత సస్పెన్షన్

మునగాల, అక్టోబర్ 16 : విధి నిర్వహణలో నిర్లక్ష్యం, విధులపై అలసత్వం, ఉన్నతాధికారులతో దురుసుగా వ్యవహరించినందుకు మునగాల పంచాయతీ కార్యదర్శి శ్వేత సస్పెన్షన్‌కు గురైంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.... మునగాల పంచాయతీ కార్యదర్శి శ్వేత ఈ నెల 14న మండల కేంద్రంలో నిర్వహించిన మొక్కలను రక్షించే వారోత్సవ కార్యక్రమానికి ఆలస్యంగా హాజరైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈఓ సురేశ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి శ్వేత ఆలస్యంపై ప్రశ్నించారు. దీనికి ఆమె తనకేమీ తెలియదని, తనకు ఎలాంటి సమాచారం లేదని ధిక్కార సమాధానం తెలిపింది. కలెక్టర్ వెంకట్రావ్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్వేత ఈ విధంగా ప్రవర్తించడం నచ్చని సీఈఓ సురేశ్‌కుమార్ కలెక్టర్ వెంకట్రావ్‌కు తెలిపారు. విచారణ చేపట్టి వాస్తమని తేలడంతో శ్వేతను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో బరాఖత్‌గూడెం కార్యదర్శి వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

### కిట్స్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు

కోదాడ టౌన్, అక్టోబర్ 16 : పట్టణంలోని అనంతగిరి రోడ్డులో గల కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కిట్స్ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



సాంస్కృతిక ప్రదర్శన